నీకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా, నిశ్చలంగాఉండు, నిర్మలంగాఉండు. నీ పని ఏదో నీవు శ్రద్ధగాచేసుకో, మిగతాకాలాన్ని భగవదనుభవంపొందటానికి ఉపయోగించుకో, మీరు వంటపని నేర్చుకొంటున్నారు, వడ్రంగిపని నేర్చుకొంటున్నారు, తాపీ పని నేర్చుకొంటున్నారు ఇలా అనేక పనులు నేర్చుకొంటున్నారు కాని మన గురించి మనం తెలుసుకోవటం అనే పని మాత్రం నేర్చుకోవటంలేదు, దానికే ఈజ్ఞానయజ్ఞాలు. నీదేహాన్ని, మనస్సును జాగ్రత్తగా ఉపయోగించుకొని అమృతానుభవం పొందటానికి ప్రయత్నంచేసుకో. కాలాన్ని సద్వినియోగం చేసుకో, కాలాన్ని సద్వినియోగం చేసుకొన్నవాడు కాలాతీతుడు అవుతాడు అంటే జ్ఞాని అవుతాడు. మానవజన్మ చాలాగొప్పది, భగవంతుడు మనకు అనేక అవకాశాలు ఇచ్చాడు. అందుచేత పరస్పరం ద్వేషించుకోకుండా, పరస్పరం సహకరించుకొంటూ, ప్రేమించుకొంటూ, సమిష్టిగా కృషిచేసుకొని ఆత్మజ్ఞానాన్నిపొందండి. మేము ఒంటరిగా ఉన్నాము అనుకోవద్దు, ఆ ఒంటరితనాన్ని అనుకూలంగా తిప్పకోండి. మనకు ఎటువంటి ఆలోచనలు వస్తున్నాయి, మనలో ఎటువంటి బలహీనతలు ఉన్నాయో అర్థంచేసుకొని వాటిలో నుండి విడుదలపొందటానికి నీ సహాయంకావాలి అని భగవంతుడిని ప్రార్థిస్తూ, సిన్సియర్‌గా నీవు ప్రయత్నంచేస్తూఉంటే ఆ బలహీనతలనుండి విడుదలపొందుతావు, లోపల ఉన్న వస్తువు నీకు ఎరుకలోనికి వస్తుంది. ఇప్పడు నేను అనేటప్పటికి నీకు దేహం ఎలా స్ఫురిస్తోందో అప్పడు చావులేనివస్తువు నీకు స్ఫురిస్తుంది, అటువంటి అనుభవం ఏదేహంలో అయితే వచ్చిందో అదే నీకు కడసారిజన్మ. రమణమహర్షిగారు ఇంక ఎంతోకాలం జీవించరు, శరీరం కృషించిపోయింది అని చివరి రోజులలో భక్తులు అనుకొనేవారు కాని ఆయనకు పదహారవ సంవత్సరంలో మరణానుభవం కలిగినప్పడే ఆశరీరంపోయింది, ఇప్పడు కొత్తగాపోయేది ఏమీ లేదు, ఈ విషయం భక్తులకు అర్థంకావటంలేదు.

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 15-07-2004, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

చనిపోయేది దేహం, మరల పుట్టేది దేహం. మనహృదయంలో ఉన్న సద్వస్తువుకు జననమరణములతో సంబంధంలేదు. హృదయంలో ఉన్న సద్వస్తువును దేహానికి పరిమితం చేయటం వలన దేహం చనిపోయినప్పడు మనం చనిపోతున్నాము అని, దేహం పుట్టినప్పడు మనం పుట్టాం అని అనుకొంటున్నాము. చిక్కుఅంతా ఇక్కడే ఉంది. ఒక అఖండమైన వస్తువును, ఆనందంతో శాంతితో నిండినటువంటి వస్తువును, మరణం ఎలాఉంటుందో తెలియని వస్తువును దేహానికి పరిమితం చేయటం వలన ఇబ్బందులు అన్నీ వస్తున్నాయి, అశాంతి ఇక్కడ నుండే ప్రారంభమవుతోంది, దుఃఖం ఇక్కడ నుండే ప్రారంభమవుతోంది.



రమణభగవాన్ మరణానుభవం ద్వారా అమరత్వంపొందారు, అమరత్వం అంటే మరణంలేనిస్థితి, దేహం మరణించినా నేను మరణించటం లేదు అనే అనుభవంపొందాడు. గ్రంధాలలో గ్రంధులు ఉంటాయి, భ్రమలు ఉంటాయి, మాయలు ఉంటాయి కాని బ్రహ్మం నీ హృదయంలో ఉంది. అందుచేత గ్రంధాలలో వెదికితే బ్రహ్మం నీకుదొరకదు, నీ హృదయంలో వెదికితే అదినీకు దొరుకుతుంది అని బాబాచెప్పారు. మనిషి యొక్క గమ్యం అమరత్వంపొందటం అని వేదంలో చెప్పారు. అయితే ఒక్క విషయం మీరు గుర్తుపెట్టుకోవాలి, మనకు గమ్యం ఎంత ముఖ్యమో చేసేసాధన కుడా అంతేముఖ్యం. ఇందులో ఒకటి ఎక్కువ, ఒకటి తక్కువకాదు. సాధనలో గమ్యాన్ని మరచిపోకూడదు. గమ్యం మనదృష్టిలో ఉన్నంతమాత్రంచేత సాధన లేకుండా మనం దానిని పొందలేము అందుచేత రెండూ ముఖ్యమే. అయితే మనం చేసే సాధన ఎలా ఉండాలి అంటే ఇష్టంతో చెయ్యాలి, హృదయపూర్వకంగా చెయ్యాలి, దానిని పొందాలి అనే జిజ్ఞాస ఉండాలి. జిజ్ఞాస లేకుండా జ్ఞానం కలుగదు. కొంతమంది వారికి అశాంతిగా ఉన్నప్పడు కృష్ణా, రామా అనుకొంటారు, అలా అనుకోవచ్చు దానిలో పొరపాటు లేదు కాని జ్ఞానం అనేది అలాగవచ్చేదికాదు. భగవంతుడు లేడు అని వాదించేవారు కూడా వారికి ఏదైనా కష్టం వచ్చినప్పడు భగవంతుడిని స్మరిస్తారు. అప్పడు దేవుడు ఎందుకు అవసరం అంటే ఆకష్టాలను తట్టుకొనే శక్తివారికి లేకపోవటం వలన అక్కడ దేవుడు వారికి కావాలి.

అమరత్వం గురించి వేదంలో ఏమని చెప్పారు అంటే గౌరవాల వలన మీరు దానిని పొందలేరు, సంతానం వలన మీరు దానినిపొందలేరు, ధనం వలన దానిని పొందలేరు మరి ఎలా పొందగలము అంటే త్యాగబుద్ధి వలన అది మనకు సాధ్యమవుతుంది. వ్యక్తిభావనను ఎవడైతే త్యాగం చేస్తున్నాడో వాడుమాత్రమే అమరత్వం పొందుతాడు. మన దైనందిన జీవితంలో ఏదైనా మాట్లాడేటప్పడు పదిసార్లు ఆలోచించి మాట్లాడితే, పదిసార్లు ఆలోచించి పనిచేస్తే ప్రమాదంలో పడము. అందుచేత ఆధ్యాత్మికంగా అభివృద్ధిపొందటం కోసం ఎవడైతే ప్రయత్నంచేస్తున్నాడో వాడు కత్తిఅంచుమీద నడిచేవాడు ఎంత జాగ్రత్తగా ఉంటాడో అంత జాగ్రత్తగా ఉండి సాధన చేస్తేనే మీకు ఆధ్యాత్మికఔన్నత్యం కలుగుతుంది. నీవు మనస్సుతో నేర్చుకొనే విద్యలు అన్నీ మనస్సుతో కల్పించబడిన దేహాన్ని పోషించటానికి ఉపయోగపడతాయి. అది సత్యమైనవిద్య కాదు, నిత్యమైనవిద్య కాదు. ఒక్కఆత్మవిద్య మాత్రమే సత్యమైనది, నిత్యమైనది. ఎవడైతే అమరత్వంపొందాడో వాడి దగ్గర నుండి శాంతికిరణాలు, జ్ఞానకిరణాలు ఆఉపాధి నుండి వెదజల్లబడుతూ ఉంటాయి. అమరత్వంపొందిన వాడి దగ్గర ఉన్నప్పడు మనకు వెంటనే అమరత్వం రాకపోయినా, దానిని పొందాలనే కోరిక మనకు కలుగుతుంది. బాగా చదివేవాడితో సామాన్యంగా చదివేవాడు స్నేహం చేయటం వలన లాభం ఏమిటి అంటే వీడికి నూటికినూరు రాకపోయిన మనం కూడా బాగా చదువుకోవాలి అనే బుద్ధికలుగుతుంది. వాడు ఎన్ని మార్కులు తెచ్చుకొంటున్నాడో మనం

కూడా తెచ్చుకొందాము అనే తపన కలుగుతుంది. అందుచేతనే మనం చేసే స్నేహాల విషయంలో, చదివేపుస్తకాల విషయంలో జాగ్రత్తగా ఉండమని చెపుతారు. అనుకరణపనికిరాదు. అసలు దారిద్ర్యం ఎప్పడు వస్తుంది అంటే ఇతరులతో పోల్చుకోవటం వలన దారిద్ర్యం వస్తుంది అని బాబాచెప్పారు. మనం ఎవరితోనూపోల్చుకోకూడదు. మనంతట మనంగా ఉంటే మనకు ఏమీ దారిద్ర్యం ఉండదు. బాబాఏమని చెప్పారు అంటే మిమ్మల్ని మీరు బాగుచేసుకోవటానికి ప్రయత్నంచేయండి, మీ బుద్ధిలో ఏమైనా దోషాలు ఉంటే వాటిని తొలగించుకోవటానికి ప్రయత్నంచేయండి. మిమ్మల్ని మీరు బాగుచేసుకోవటం మానివేసి ఇతరులను విమర్శించటం వలన మీకు ఏమీ కలిసిరాదు, పైగా మీబుద్ధిలో ఉన్న దోషాలు పెరుగుతాయి. మీ భవిష్యత్ మీరు చూసుకోకుండా ఎవరినో ఇతరులను విమర్శిస్తూ కూర్చొంటే మీకు కాలం, శక్తి వృధాఅవుతాయి ఈలోపు మరణంవచ్చేస్తుంది. మన బుద్ధిలో ఏమైనా మంచి ఉంటే మంచి, దోషాలు ఉంటే ఆదోషాలు మరణానంతరం మనకూడా వస్తాయి కాని మనం సంపాదించిన డబ్బుగాని, గౌరవంగాని, మన చుట్టాలు కాని మరణానంతరం ఏదీ మనకూడారాదు. మీకు దేహం ఉంది, మనస్సు ఉంది, ఈ రెండూ మీరు కాదు. ఈ రెండింటికి అతీతంగా మీ హృదయంలో ఒక నిజం ఉంది, దానిని అనుభవంలోనికి తెచ్చుకోవటానికి ఈ దేహాన్ని, మనస్సును ఉపయోగించుకోండి. మీ పని మీరు శ్రద్ధగాచేసుకొంటూ, అమృతానుభవంపొందటానికి మిగతాకాలాన్ని సద్వినియోగం చేసుకోండి. మీరు గమ్యాన్ని మర్చిపోవద్దు, సాధనను మర్చిపోవద్దు. మనస్సు సత్వగుణంలో ఉన్నప్పడు చాలా హేపీగా ఉన్నాము అని అనిపిస్తుంది, అలాగే సాధనచేసేటప్పడు కూడా అంత ఆనందంగా ఉండాలి అంతేగాని ఉసూరుమంటూ ఉండకూడదు. ఈ జపం ఎప్పడు అయిపోతుంది, ఈధ్యానం ఎప్పడు అయిపోతుంది అని కనిపెట్టుకొని ఉండేవాడికి ఆత్మజ్ఞానం ఏమిటి?

మీ అమ్మగారు ఎవరు, మీ నాన్నగారు ఎవరు అని ఒక భక్తుడు బాబాగారిని అడిగాడు. మా అమ్మగారు మాయ, మా నాన్నగారు భగవంతుడు అని బాబాచెప్పారు. అంటే పార్వతిమాయ, శివుడు సత్యం. మాయలేకపోతే ప్రపంచంలేదు. మాయలోనుండి బయటకు వచ్చినవాడికి ప్రపంచం ఏముంది? వాడికి ప్రపంచంలేదు. ఒకవేళ వాడు ప్రపంచంలోఉన్నా లేనివాడితో సమానము ఎందుచేతనంటే వాడు ప్రపంచంలో ఒక భాగం కాదు. బాబా ఏమిచెపుతున్నారు అంటే మీరు ఎవరినీ ఉద్ధరించనక్కరలేదు మహానుభావులారా, ముందు మీ బుద్ధిలో ఉన్న దోషాల నుండి బయటపడండి. మీ బుద్ధిలో దోషాలు పెట్టుకొని ఇతరులను విమర్శించటం ఎందుకు? మీరు బాగుపడటానికి ప్రయత్నం చేసుకోండి. ఒకవేళ ఇతరులను బాగుచేయటానికి మీకు శక్తి ఉంటే వారికి సహాయంచెయ్యండి. ఒకవేళ మీరు చెప్పినా వారు వినరు అనుకోండి, వారిమీద ద్వేషం పెట్టుకోవద్దు, వారిని విమర్శించటం మొదలుపెట్టవద్దు, వారిని విమర్శించటం మొదలుపెడితే



మీరు పూర్తిగా మూలంలో పాడైపోతారు అందుచేత బహుజాగ్రత్తగా ఉండండి అని బాబా చెపుతున్నారు. దేవుడు ఎక్కడ ఉన్నాడు, నీ హృదయంలో ఉన్నాడు. దేహం బయట ఇంద్రియాలను పెట్టాడు బయట ప్రపంచాన్ని పెట్టాడు. నువ్వు ఏమిచేస్తున్నావు అంటే మనస్సును ఇంద్రియాలద్వారా బయటకు పంపేస్తున్నావు. ఎవడైతే బుద్ధిమంతుడో, ఎవడికైతే పూర్వజన్మలలో పుణ్యబలంఉందో, ఎవడైతే నిష్కామకర్మచేస్తున్నాడో, ఎవడైతే జపధ్యానములు చేస్నున్నాడో వాడికి మాత్రమే మనస్సులోపలకు తిరుగుతుంది. ఎవడి మనస్సు అయితే లోపలకు తిరిగిందో వాడికి మాత్రమే హృదయంలో అంతర్యామిగాఉన్న భగవంతుడు అందుతాడు. మనం మనస్సును ఇంద్రియాలద్వారా బయటకుపంపుతూఉంటే, బయట అనేక దృశ్యాలు ఉంటాయి, వాటికి ఆకర్షింపబడతాము. మనం దేహాన్ని ఇంద్రియాలకోసం ఉపయోగించుకొంటున్నాము కాని లోపలఉన్న పరమాత్మను తెలుసుకోవటానికి ఉపయోగించటంలేదు, చివరకు మాయలో పడుతున్నాము, ఇలా ఆజన్మకు ఆజన్మమాయలో కూరుకొనిపోతున్నాము. ఇంక ఒడ్డుకువచ్చే సమస్యే లేదు అంటున్నారు బాబా.

కోరిక లేకుండా ఎలా పనిచేస్తాము, కోరిక ఉండాలి కదా అని ఎవరో ఈ రోజు పేపర్లోవ్రాసారు, వ్రాసినవాడు పండితుడే. పాండిత్యంలో ప్రమాదం ఎక్కడఉంది అంటే వారికి పుస్తకజన్యజ్ఞానం ఉంటుంది కాని ఆత్మజ్ఞానం ఉండదు. నీ దేహప్రారబ్ధంలో ఏదైనా జరగవలసి ఉంటే అది నీ కోరికతో సంబంధం లేకుండా జరిగిపోతుంది. ఈ దేహం భూమి మీదకు ఎందుకు వచ్చిందో అది నీకోరికతో సంబంధం లేకుండా ఈ దేహంద్వారా ఆపని జరిగిపోతూ ఉంటుంది. కోరికకు దానికి సంబంధంలేదు. కోరికకు శక్తిలేదు, శక్తి ఈశ్వరుడిది. నీ చేతిలో ఉన్న పనిని శ్రద్ధగాచేసుకో, ఫలితంపట్ల స్పృహ పనికిరాదు. గొప్పలకోసం ఏపనికివెళ్ళకు, అసూయపనికిరాదు, అసూయవలన మనకు కలిసివచ్చేది ఏదీలేదు. ఎవరో వాడిప్రారబ్ధాన్ని బట్టి అభివృద్ధిలోనికి రావచ్చు. మీరు అభివృద్ధిలోనికి రాకపోవచ్చు. అదీనిజంకాదు, ఇదీ నిజంకాదు ఇది అంతా స్వప్నసమానము అని భగవాన్ చెప్పారు. ఇదంతా నిజంగా మాకు కనిపిస్తూఉంటే ఇది స్వప్నం అనిమీరు చెపుతారు ఏమిటి? మీరు చెప్పినమాటలు మేము నమ్మాలా అనిభగవాన్‌ను ఒక భక్తుడు అడుగుతున్నాడు. భగవాన్ ఏమిచెప్పారు అంటే నీకు గాఢనిద్రలో ఉండగా స్వప్నం వస్తుంది. ఆస్వప్నంలో కనిపించే మనుషులు, విషయాలు అప్పడు నీకు నిజంలాగ కనిపిస్తున్నాయి కదా అని అడిగారు, స్వప్నంలో ఉండగా అవి నిజంలాగే కనిపిస్తున్నాయి. ఎప్పటి వరకు అవినీకు నిజంలాగ కనిపిస్తున్నాయి? మెలుకువ వచ్చేవరకు అవి నిజంలాగ కనిపిస్తున్నాయి. అలాగే నీవు హృదయంలో మేల్కొనేవరకు జాగ్రదవస్థలో వచ్చిన విషయాలు కూడా నిజంలాగ నీకు కనిపిస్తాయి కాని అవి ఎంత అసత్యమో ఇవికూడా అంతేఅసత్యం. తాడు తాడుగా నీకు కనిపించే వరకు తాడు పాముకింద కనిపించటం ఆగదు అలాగే హృదయంలో ఉన్నవస్తువు ఉన్నది ఉన్నట్లుగా నీకు తెలిసేవరకు ఈచావులు, పుట్టుకలు ఆగవు, అసత్యాన్ని

సత్యం అనుకొంటావు, అజ్ఞానాన్ని జ్ఞానం అనుకొంటావు. కొంతమంది ఏమనుకొంటారు అంటే మేము చాలా తెలివైనవారము అనుకొంటారు, కొంతమంది మేము ధనవంతులము అనుకొంటారు, కొంతమంది మాకు అధికారం ఉంది అనుకొంటారు. ఇదంతా భగవాన్ ఒక్కముక్కలో తీసేసారు. ఇవన్నీ ఎవరు అనుకొంటున్నారు? మనస్సు అనుకొంటోంది. మనస్సు ఎంత నిజమో, మనస్సు అనుకొనే విషయాలు కూడా అంతేనిజం. అందుచేత మనస్సు పూర్తిగా నశిస్తేనే గాని ఆత్మానుభవంకలుగదు. ఎవడైతే వాడి మనస్సును వాడు మింగాడో వాడు యోగిఅవుతాడు, యోగి ఈశ్వరుని స్వరూపాన్నిపొందుతాడు.

ఒక అమెరికా దేశస్థుడు భగవాన్ దగ్గరకు వచ్చాడు. అక్కడ నుండి తిరిగి వెళ్ళిపోతూ భగవాన్‌తో నేను ఈరోజువెళుతున్నాను, మిమ్మల్ని విడిచివెళ్ళటం కష్టంగానే ఉంది కాని వెళ్ళాలి. మీ సందేశాన్ని అర్ధిస్తున్నాను. నాకు ఏ ఉపదేశం అవసరమో నాకంటే మీకే బాగా తెలుసు. నాకు ఉపయోగపడే మాటలు చెప్పండి, ఎందుకు అడుగుతున్నాను అంటే మీకు దూరంగా ఉన్న రోజులలో మననం చేసుకోవటానికి అడుగుతున్నాను అన్నాడు. అది బుద్ధిమంతుడి లక్షణం. మనం శ్రద్ధగావినాలి విన్న విషయాన్ని ఇంటికి వెళ్ళి అందులో మనకు నచ్చిన వాటిని మననం చేసుకోవాలి, మననంచేసుకోగా చేసుకోగా అదే ధ్యానం క్రిందమారుతుంది. దేహానికి పరిమితమై ఉన్నవాడు ప్రతీవాడు పశువే. ప్రతీజీవుడు కూడా పశువుతో సమానము. ఎందుచేతనంటే పశువుకూడా ఆదేహాన్ని నేను అనుకొని దేహంతో పరిమితమై ఉంటుంది. కొడితే బాధపడుతుంది, తెలగపిండి పెడితే సంతోషిస్తుంది. మనంకూడా అంతేకదా ఎవరైనాపెడితే సంతోషిస్తాము, కొడితేఏడుస్తాము. అంటే దేహంతో తాదాప్యం పొందేవాడు ప్రతీవాడు పశువే. పశువులందరికి భర్త శివుడు. ఈపశువులందరు పశుపతిని స్మరించుకోవటం వలన పశుబుద్ధిపోతుంది, శివబుద్ధి కలుగుతుంది అంటే దేహబుద్ధిపోతుంది ఆత్మబుద్ధి కలుగుతుంది, వాడు జననమరణ చక్రంనుండి విడుదలపొందుతాడు. ఈ మధ్యఒక భక్తుడు ఆయన అనుభవం చెప్పాడు. అతను చీకటిలో రోడ్డు మీద నడిచివెళ్ళిపోతున్నాడు. సరిగ్గా పాముచోడ్డు మీద అడ్డంగావస్తోంది. ఇంకపాము మీద అడుగువేస్తున్నాడు ఒక్కసారిలోపల నుండి ఆగు, నడక ఆపుచెయ్యి అనిలోపల నుండి వచ్చింది. ఏమిటి ఇలా వచ్చింది అని ఆగిపోయి ముందుకు చూస్తే పాము పాకి వెళ్ళిపోతోంది. వీడు ఆగకుండా సరిగ్గా ఇంకో అడుగువేస్తే అది పాము మీదపడును. గురువు ఎక్కడ ఉన్నాడు నడిచివెళ్ళేవాడు హృదయంలోను ఉన్నాడు, అంతటా ఉన్నాడు, అంతర్యామిగా కూడా ఉన్నాడు. తల్లితండ్రులను పెద్దలను అందరను గౌరవించవలసిందే కాని మన అజ్ఞానమనే చీకటిని తొలగించేవాడు ఆచార్యుడు మాత్రమే. జననమరణచక్రం నుండి మనలను విడుదలచేసేవాడు గురువు మాత్రమే అందుచేత ఆచార్యుడిని దేవునితో సమానంగాచూడు. అతను ఎక్కడోలేడు నీ హృదయంలోనే ఉన్నాడు నిన్ను నియమించేవాడు ఆయనే, ఆయనే నీగతి. అమెరికా దేశస్థుడితో భగవాన్ ఏమంటున్నారు



అంటే నేను నీకు వెలిగా లేను, నీలోపలేఉన్నాను నీకూడా ఉన్నాను, ఒకవేళనీవు అమెరికా వెళ్ళిపోతే అమెరికాలో నేను లేను అని అనుకోవద్దు. ఇప్పడు నీకు ఏదైతే కనిసిస్తోందో ఈ దేహన్ని గురువు అనుకోకు, నీకు కనిపించే ఈ దేహం గురువుకాదు, నీ హృదయంలో ఉన్న గురువును కనిపెట్టవయ్యా, నువ్వు అన్వేషణ చేసి ఆగురువును కనిపెడితే గురువుకు వేరుగా, ఒక్కక్షణంకూడా నీవుఉండవు. గురువుకు దూరంగా ఉన్నాము అనే తలంపే అసలు నీకురాదు. హృదయవిద్యను నేర్పేవాడే గురువు, హృదయంలోనికి తీసుకొనివెళ్ళేవాడే గురువు. బాహ్యంగా నీవు నేర్చుకొనే చదువుల వలన మనస్సును ఎలా నియమించుకోవాలోనీకు తెలియదు, అది సద్గురువే చేయాలి. నువ్వుస్కూలులో చదివేది, కాలేజీలో చదివేది కంప్లీట్ ఎడ్యుకేషన్ కానేకాదు, అదినీపొట్ట పోషణకు పనికివస్తుంది. నీకు పొట్టఉంది కాబట్టి ఇవిఅన్నీ నిజంకింద అనిపిస్తున్నాయి. ఈవిద్యలు నేర్చుకొనే మనస్సు ఎంత నిజమో, అవికూడా అంతేనిజం, ఇవి అన్నీ మిధ్యావిద్యలు, ఆత్మవిద్య మనస్సు చేతనేర్చుకొనేదికాదు. మనస్సును సంస్కరించుకొని, దానిని ఉపసంహరించి, దాని పుట్టుస్థానంలో మనస్సును నిలబెట్టి ఉంచితే అప్పడు మనస్సునశిస్తుంది, అప్పడు లోపలఉన్న సద్వస్తువునీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది. అదే నిజమైన విద్య, అదే ఆత్మవిద్య,

నీజీవితవిధానం ఎలా ఉండాలి, జననమరణరహితస్థితిని పొందటానికి నీ మనస్సును ఎలా ప్రిపేర్ చేసుకోవాలి అనేది ఏయూనివర్శిటీలోను చెప్పరు, అది గురువును ఆశ్రయించి నీవు పొందవలసిందే. గురువు నీ హృదయంలోనే ఉన్నాడు. నువ్వు ఎక్కడికో అమెరికావెళ్ళి పోతాను అంటున్నావు. నీ హృదయంలో ఉన్నది నీ కూడానే వస్తుంది కదా. నీవు అమెరికా వెళ్ళిపోతే పరిసరాలు మారతాయి, మనుషులు మారతారు. ఇవన్నీ బాహ్యానికి సంబంధించినవే, కాని గురువు మటుకు నీవు ఎక్కడికి వెళ్ళినా నీకూడానే ఉంటాడు, నిన్ను ఒక్క క్షణం కూడా విడిచిపెట్టడు. ఒకవేళ ఈ దేహం మరణించాక నీవు నరకానికి వెళ్ళిపోతున్నావు అనుకో, నీకూడా నరకానికి వస్తాడు. నువ్వుతినవలసిన మొట్టికాయలు ఏమైనా ఉంటే నీబదులు ఆయనే తిని నిన్ను రక్షిస్తాడు, వాడు గురువు, గురువు అంటే ఆత్మ, గురువు అంటే బ్రహ్మం. బ్రహ్మంను విడిచిపెట్టి నీవు ఎలా ఉంటావు. మనందరం అసలు భగవంతుడిలోనే ఉన్నాము. మనస్సును కలతపెట్టుకోవద్దు, ఏదో జరిగిపోతోంది అనుకోవద్దు, భగవంతుడికి తెలియకుండా ఏదీ జరగటానికి వీలులేదు. ఆయనే మన యజమాని. మీటింగులో అధ్యక్షుడికి తెలియకుండా ఏదీ జరగదు అలాగే ఈప్రపంచానికి అధ్యక్షుడు భగవంతుడు, అందుచేత ఆయనకు తెలియకుండా ఈ ప్రపంచంలో ఏమీజరగదు. ఏదో జరిగిపోతోంది అని మనం అనుకొని, కంగారుపడి అశాంతి తెచ్చుకొంటున్నాము. జాగ్రదవస్థ, స్వప్నావస్థ, సుషిప్తి ఈ మూడు అవస్థలలోను చైతన్యం ఉంది. అట్టి చైతన్యం నీ హృదయంలోనే ఉంది. ఆ చైతన్యముతో నీకు సంపర్కము ఏర్పడినప్పడు ఈ జాగ్రదవస్థ, స్వప్నావస్థ, సుషిప్తి అవస్థ ఇవి అన్నీ వూరికే నీడలుగా

కనిపిస్తాయి, ఆశరీరం కూడా ఒక నీడ కింద కనిపిస్తుంది. ఈశరీరం చనిపోయేటప్పుడు శరీరంపోతోంది అనే స్పృహ నీకురాదు ఆచైతన్యమే నీకు గురువు, వాడిని స్మరించుకో వాడితో అనుబంధంపెట్టుకో, నువ్వు ఎండలో ఉన్నావు, అక్కడ చెట్టు ఉంది. ఎండలో కూర్చొని ఏడ్చేబదులు ఆ చెట్టు నీడకు వెళ్ళు అప్పడు ఎండ నిన్ను ఏమిచేయదు. అక్కడ చెట్టుఉంది, దానికింద నీడ ఉంది. కాని ఆ నీడ నిన్నుపిలవదు. ఆ నీడకు వెళ్ళికూర్చోవాలనే తపన నీకు రావాలి. అదే గురువు చేసేపని. బయటి గురువు నీకు బోధించి బోధించి జ్ఞానం పొందాలనే తపనను కలుగజేస్తాడు ఆ తపన వలన నీ మనస్సు లోపలకు ప్రయణంచేస్తుంది. అప్పడు లోపల గురువు నీ మనస్సును లాక్కొని, ఆయన స్వరూపాన్ని నీకు ఇస్తాడు. బయటగురువు నీకు జిజ్ఞాసనుకలుగజేస్తాడు, లోపల గురువు నీకు జ్ఞానాన్ని ఇస్తాడు. బయట గురువు, లోపల గురువు వేరుకాదు, ఉన్నది ఒక్కటే, మౌన భాషను అర్థంచేసుకొనే శక్తి మనకులేదు కాబట్టి మనకు బోధించటానికే లోపలఉన్నగురువు ఒకరూపంధరించివస్తాడు. నన్ను ఉపదేశం చెప్పమని అడుగుతున్నావు. నీ మనస్సు అణిగిపోతే సందేశం నేను చెప్పనక్కరలేదు. నీ హృదయమే నీకు ఎప్పడూ చెపుతూ ఉంటుంది. ఇది మంచి, ఇది చెడ్డ అని మనహృదయమే మనకు చెపుతూఉంటుంది. హృదయం యొక్క వాణి మనకు వినబడాలంటే ఈజన్మలోగాని, పూర్వజన్మలోగాని మనం ధర్మాన్ని ఆచరించి ఉండాలి.

ఈ గ్రంధాలు అక్కరలేదు, ప్రవచనాలు అక్కరలేదు రాముడుఎలా జీవించాడో అలాజీవించటం నేర్చుకోనీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది అని కొంతమంది చెపుతూ ఉంటారు. రాముడు ఎప్పడో త్రేతాయుగం వాడండి, ఇది కలియుగం, ఇప్పడు రాముడులాగ ఎలా జీవించగలము అంటున్నారు. అది కష్టమే కాని నీవు అలా జీవించగలిగితేయింక సాధనతో పనిలేదు, దేనితోను పనిలేకుండా ఆత్మజ్ఞానం వచ్చి నిన్ను వరిస్తుంది, ఒక్క జ్ఞానమేకాదు నీకు అవసరమైనవి అన్నీ సమకూరుతాయి. ఒక పనిసాధించటానికి మనం కష్టపడ్డాము అనుకోండి, ఆపని పూర్తి అయిన తరువాత ఆ కష్టాన్ని మరిచిపోతాము. అలాగే మనం సాధనచేసేటప్పడు విసుగువస్తుంది, చిరాకువస్తుంది, కష్టంగా ఉంటుంది, లోపల మన ఇంటికి అంటే హృదయంలోనికి వెళ్ళాక మొత్తం అంతా మర్చిపోతాము ఈ పుట్టుకలు, చావులు, మనంపడ్డకష్టాలు ఏమీలేదు. మన ఇంటికి మనం రాలేదు కాబట్టి ఇదంతా నిజం కిందకనిపించింది. ఇప్పడు మన ఇంటికి మనం వచ్చేసాము, ఇది ఒక్కటే నిజం అని అప్పడు మనకు అనిపిస్తుంది. మన హృదయంలోనికి మనం వెళ్ళటమే మోక్షం. హృదయంలోనికి వెళితే ప్రకృతిలో నుండి విడుదలపొందుతాము. దేహాన్ని గురువు అనుకొన్నప్పడు గురువుకు దూరంగా ఉన్నాము అనిపిస్తుంది. నీహృదయంలో ఉన్న గురువును తెలుసుకొన్నప్పడు దూరము, దగ్గరలేదు. ఎప్పడూ గురువుతోనే ఉన్నాము అని నీకు అనిపిస్తుంది. అప్పడు హృదయంలో నుండే నీకు సందేశం అందుతూ ఉంటుంది, బయటనుండి ఉపదేశం అక్కరలేదు. ఎవడైతే గురువు అనుగ్రహంలో పడ్డాడో వాడుతరించబడతాడు. అంతా గురువు అనుగ్రహమే. సాధనచేయాలనే తలంపును కలుగచేసేది, నీచేత సాధన చేయించేది, చివరకు గురువునుపొందటం అంటే మోక్షాన్ని పొందటం ఇది అంతా అనుగ్రహమే చేయిస్తుంది. అందుచేత కృష్ణుడు గీతలో ఏమిచెప్పాడు అంటే అర్జునా! నీవు చేతులు ఆడించు అంతా దేవుడే చూసుకొంటాడు అని చెప్పాడు. అర్జునుడు చాలా గొప్పగా యుద్ధం చేసాడు అనుకొంటారు. పని నాది, గౌరవంనీది అన్నాడు. గీతలో కృష్ణుడు ఎన్నోమెలికలుచెపుతాడు. అర్జునుడికి వాడి ఆయుధం గాండీవం అంటే చాలా ఇష్టం. నా ఆయుధాన్ని ఎవడైతే తిట్టాడో వాడిని చంపుతాను అని ఒకసారి అర్జునుడు శపధంచేస్తాడు. భారతయుద్ధ సమయంలో ఒకసారి ధర్మరాజు కర్ణుడితో యుద్ధంచేయవలసివచ్చి, ఆయనతో యుద్ధంచేయలేక అక్కడ అర్జునుడు భీముడు కనిపించకపోవటంతో పారిపోయివచ్చేస్తాడు. అప్పడు ధర్మరాజుకు అర్జునుడి మీద కోపం వచ్చి గాండీవాన్ని తిడతాడు. గాండీవాన్ని తిట్టినవాడిని చంపుతానని అర్జునుడు శపధంచేసాడు, ఆశపధంప్రకారం అన్నగారిని చంపాలి. అక్కడ ఏదో పొరపాటు మాటమాట్లాడినా ధర్మరాజు గొప్పవాడే. ఆయనను రక్షించాలి, అర్జునుడి శపధాన్ని గౌరవించాలి, అక్కడ కృష్ణుడి తెలివితేటలు చూడండి. అప్పడు కృష్ణుడు ఒక ఉపాయం చెపుతాడు. ఒక మనిషిలో ఏదోషం లేదుఅనుకో, ఏదోషం లేనివాడిని మనం తిడితే ఎదుటి మనిషిని చంపటం వలన ఎటువంటి పాపం వస్తుందో వీడికి అటువంటి పాపం వస్తుంది అని శాస్త్రంలో ఉంది. అందుచేత నీవు ధర్మరాజును దూషించివదిలెయ్యి, అప్పడు ధర్మరాజును చంపిన వాడితో సమానం అని సలహాచెప్పాడు అంటే అర్జునుడి శపధం నెరవేరింది, ధర్మరాజు ప్రాణం కాపాడాడు. ఇక్కడ మనం గ్రహించవలసింది కధకాదు కధ అనేది మామిడి పండుతొక్కవంటిది. మామిడి పండు పైన తొక్క ఉంటుంది. ఆతొక్కకోసం మామిడిపండు ఎవడూకొనడు అందులోని గుంజు తినటంకోసం, ఆరసం తాగటంకోసం మామిడిపండు కొనుక్కొంటాము. అలాగ కధ అనేది పూరికే తొక్కవంటిది. లోపల ఉన్న సారాన్ని మనం గ్రహించాలి. ఏమనిషి అయితే పరమపవిత్రుడో ఆ పరమపవిత్రుడిని కనుక మనం దూషిస్తే ఒక మనిషిని చంపటం వలన ఎటువంటి పాపంవస్తుందో నీకు కూడా అటువంటి పాపమేవస్తుంది సుమా అని కృష్ణుడు చెప్పకుండా చెపుతున్నాడు. మీ అత్తగారు చాలా మంచావిడ అనుకోండి, మీకు ఏదోకోపం వచ్చి తిడతారు అనుకోండి, అది ఒక మనిషిని హత్య చేసిన దానితో సమానము, అందుచేత బహుజాగ్రత్తగా ఉండండి, ఒక మనిషి ఇంకో మనిషిని హత్యచేస్తే ఎంతపాపం వస్తుందో, మంచి వారిని తిట్టినా అదే పాపం వస్తుంది, ఆపాపం మరల వచ్చే జన్మలో మీరు అనుభవించవలసిందే అది కృష్ణుడు చెప్పేది.

**5-08-2004**

**రమణ భాస్కర**

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 08-08-2004 | ఆదివారం | శ్రీ రమణక్షేత్రం, జిన్నూరు |
| 16 టు 21 | సోమ | హైదరాబాద్ టూర్ |
| 27-08-2004 | శుక్ర | విజయవాడ, గవర్నమెంట్ ప్రెస్ దగ్గర, శివాలయం |
| 28-08-2004 | శని | విజయవాడ, షిర్డిసాయి సేవా శిబిరం, న్యూ బ్రిడ్జ్ దగ్గర, బెంజి సర్కిల్, |
| 29-08-2004 | ఆది | అరుణాచలం |
| 06-09-2004 | సోమ | భీమవరం, శివరావు పేట, సరస్వతిగారి ఇల్లు |

## సత్య మార్గము

'సత్యము' అనగా మార్పు లేనిది, వికారాలు లేనిది, దేశ కాల పరిస్థితులకు అతీతమైనది, అట్టి సత్యమే ఈ సకల చరాచర సృష్టికి ఆధారమైయున్నది. అదే 'ఆత్మ' అదే స్వరూపము. సత్యము లేదా ఆత్మ సచ్చిదానంద స్వరూపముగా, సర్వ వ్యాపకమై యున్నది. ఆత్మసాక్షాత్కారమనేది మనము ఎప్పుడో క్రొత్తగా పొందేది కాదు, అనాది నుండి మనము పరబ్రహ్మామే. అట్టి పరమసత్యము 'నేను'గా 'తాను'గా అనుభవంలోనికి రావడానికి కల్పిత వేరుభావన అనగా అహంభావనలో నుండి బయటకు రావాలి. మనను బంధించేవి 'నేను-నాది' రూపంలో వున్న రాగద్వేషాలే కాని ఇతరులు కారు. కేవలం అహంభావన అనే తెర సత్యాన్ని మరుగుపరుస్తుంది. మన వాంఛలే మనను బంధిస్తున్నాయి. కేవలము 'దేహమే - నేను' అను బుద్ధివలన పరిమితులకులోనై బంధంలో చిక్కుకొని దుఃఖసాగరంలో పడుచున్నాము. మన బంధువులు, మిత్రులు అందరికంటె సత్యము అత్యంత సమీపంగావుంది. సత్యానుభూతిని మించి పొందవలసిన వస్తువు మరొకటి లేదు, సత్యమే సర్వస్వం. సత్యమే నిజమైన ఆత్మ.

'నేను' అనే పదము నిర్వికల్ప, నిత్య, సత్య, ఆత్మను సూచిస్తుంది. కాని 'దేహమే - నేను' అను తలంపు యొక్క మాయాప్రభావము మన నిజస్థితిని మరుగుపరిచి బంధంలో పడవేస్తోంది, దుఃఖానికి కారణమవుతోంది. నిజవిచారణ ద్వారా నేను అను మూలతలంపును దాని మూలంలోనికి ఉపసంహరించి దానిని నశింప జేయుటయే సత్యానుభూతినిపొందుటకు మార్గము. సత్యమే పరమపదము.

**చావలి సూర్యనారాయణమూర్తి**
టీచర్, అమలాపురం.

**5-08-2004**



**రాజమండ్రి దేవిచౌక్‌లో**
**నార్ని లింగరాజుగారి**
**నిరూష డిజిటల్ కలర్ లాబ్‌ను**
**ప్రారంభోత్సవం చేస్తున్న**
**సద్గురు శ్రీ నాన్నగారు**



**ది.25-7-2004న**
**శ్రీ పెన్మెత్స రామకృష్ణంరాజు (రాము)**
**జిన్నూరు సహకార సంఘ అధ్యక్ష పదవీ**
**బాధ్యతల విరమణ సందర్భముగా ఏర్పాటు**
**చేసిన కార్యక్రమంలో సన్మానం చేస్తున్న**
**సద్గురు శ్రీ నాన్నగారు**